క్లుప్తంగా

జర్నలిస్టు తులసీ చందుకి సంఘీభావం

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛను నిరోధించే హక్కు ఎవరికీ లేదని, జర్నలిస్టులపై దుశ్చర్యలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని జర్నలిస్టులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు కోరారు. స్వతంత్ర జర్నలిస్టు తులసీ చందుకి సంఘీభావంగా శుక్రవారం ఏలూరులో సమావేశం నిర్వహించారు. తులసీ చందు పట్ల అసభ్యంగా వ్యవహరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. పాలక వర్గాల విధానాలను ప్రశ్నించడం జర్నలిజంలో వృత్తిలో భాగమన్నారు.మహిళా జర్నలిస్టుల పట్ల అగౌరవంగా మాట్లాడటం, ప్రవర్తించటం సరికాదన్నారు.

హెచ్‌ఎంగా మనోహర్

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.మనోహర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పీడీ నుంచి హెచ్‌ఎంగా ఆయన పదోన్నతి పొందారు. మనోహర్‌ను సర్పంచ్ కోటే నాగ మల్లీశ్వరీకుమార్, ఉపాధ్యాయులు సత్కరించారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

పెదవేగి : చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై అంగన్‌వాడీలు మరింత శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఆశ అన్నారు. పెదవేగి మండలం విజయరాయి శివారు ముత్తనవీడులోని 142 అంగన్‌వాడీ కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆశ శుక్రవారం సందర్శించారు. చిన్నారులకు అందుతున్న సేవలు, పథకాలను తెలుసుకున్నారు. విజయరాయి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష, సీహెచ్వో డి. రోజ్మేరీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేరీబాయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గడువు తీరిన వస్తువులు విక్రయిస్తే కేసు నమోదు

పెదవేగి : దుకాణాల్లో విక్రయించే ప్రతి వస్తువుపై తయారీ తేదీతోపాటు ముంగిపు గడువు తేదీని ఖచ్చితంగా ముద్రించాలని, గడువుతీరిన వస్తువులను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తూనికలు, శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. పెదవేగిలో కోడిమాంసం, కిరాణా, కొలతల ఎరువులు దుకాణాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

ప్రత్యేక ప్రార్థనలు

దెందులూరు : ఇటలీ దేశం నుంచి భారతదేశానికి వచ్చి సామాన్య జీవనం గడిపి పేదలకు మరువలేని సేవలందించిన ఫాదర్ సిల్వియో పాస్క్వలి పేరు పునీతుల పుటల్లో లిఖితమైందని ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు పేర్కొన్నారు. శుక్రవారం పెదవేగి మండలం పినకడిమి పవిత్రభూమిలో సీఎస్‌పి సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ సిల్వియో పాస్క్వలి 99వ వర్ధంతిని ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఎస్‌పి సభ అసిస్టెంట్ మదర్ జనరల్ సిస్టర్ అల్ఫోన్సా, గుంటూరు ప్రోవిన్షియల్ సిస్టర్ శౌరీల ఆధ్వర్యంలో హోలీల్యాండ్ సుపీరియర్ సిస్టర్ ఇన్యాసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఫాదర్లు, సిస్టర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు హాజరై ప్రత్యేక దివ్యబలిపూజ అర్పించారు. కార్యక్రమంలో ఫాదర్ బాల, దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, వైస్ చాన్స్‌లర్ ఫాదర్ బాబు జార్జ్, విచారణ గురువులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 2,875 ధ్రువ పత్రాల పంపిణీ

నాలుగోరోజు వన్‌టౌన్ ఐకేపీ భవన్‌లో శిబిరం



ఐకేపీ భవన్‌లో ధ్రువపత్రం అందిస్తున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, కార్పొరేటర్లు



గుడివాకలంకలో అధికారుల నుంచి ధ్రువపత్రాలు అందుకున్న గ్రామస్తులు

ఏలూరు టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరంలో శుక్రవారం నాలుగోరోజు సత్యనారాయణ పేట ఐకేపీ భవన్‌లో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని అధ్యక్షతన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా లంబాడీపేట, భావిశెట్టివారిపేట, కొమడవోలు, రామ్‌నగర్-1, -2 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు 2,875 వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. మొత్తం 3,376 దరఖాస్తులు అందగా, 1,671 కుల, 950 ఆదాయ, 01 బర్త్ సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేశారు. 182 ఆధార్ అప్‌డేట్, 70 రైస్ కార్డు, మార్పులు, చేర్పులు చేశారు. ఒకరికి పింఛన్ సమస్యను పరిష్కరించారు. ఏలూరు నగర కోఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు, జగనన్న సురక్ష క్లస్టర్-1 ఇన్‌చార్జి మోటమర్రి సదానందం, కార్పొరేటర్లు బొద్దాని అఖిలప్రియ, జున్నూరు నరసింహారావు, పార్టీ నాయకులు ఆరేపల్లి సత్తిబాబు, లక్కోజు గోపి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ప్రజలకు ఏం కావాలో తెలుసుకోవటం, ప్రతి సమస్యనూ పరిష్కరించే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని బొద్దాని తెలిపారు.

అర్హులందరికీ ధ్రువపత్రాలు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం గుడివాకలంక సీతారామ కల్యాణ మండపంలో సర్పంచ్ జయమంగళ ప్రభావతి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు మండల ప్రత్యేక అధికారి, డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ జగనన్న సురక్షలో అర్హులందరికీ ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. తహసీల్దార్ బి.సోమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలందరికీ చేరవ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేసి మండల పరిషత్, జెడ్పీ పాఠశాలలను నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిందన్నారు. అనంతరం డీఆర్వో చేతుల మీదుగా అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. తొలుత అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళకుమారి, ఎంపీటీసీ మోరు రజని, కార్యదర్శి ప్రసాద్‌బాబు, పాలకవర్గ సభ్యులు, పశువైద్యాధికారి ఎం.లక్ష్మి, రెవెన్యూ, పంచాయతీ, ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలనలో పారదర్శకత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకత కనిపిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేర్చటంతోపాటు ప్రజలకు సేవలు అందించటంలో ముందున్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి విధానాలు లేవు. ఇప్పుడు సీఎం జగన్ కొత్తగా ప్రజలకు ఇంటివద్దకే సేవలు అందిస్తున్నారు. ఇలాంటి సర్టిఫికెట్లు కావాలంటే రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది.

– ఎల్.నాగేశ్వరరావు, సత్యనారాయణ పేట, ఏలూరు

ప్రజల వద్దకే సేవలు



ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవ చేయాలనే విధానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి కార్యక్రమాలు చేయటం బాగుంది. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని చూపిస్తున్నారు. ఎన్నికల్లో చెప్పిన విధంగానే కొత్త తరహాలో పాలన చేయటం సంతృప్తికరంగా ఉంది. ప్రజలకు అవసరమైన పనులన్నీ ఇంటివద్దకే చేరువకావటం సంతోషమే.

– ఎం.దుర్గాభవాని, కొమడవోలు, ఏలూరు

గతంలో ఎన్నడూ చూడలేదు



జగనన్న సురక్ష లాంటి కార్యక్రమం గతంలో ఎన్నడూ జరగలేదు. కనీసం మండల స్థాయిలోనైనా చేపట్టలేదు. ప్రజలు పడుతోన్న సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నారు. నాకు సొంత ఊళ్లోనే ఆదాయ ధ్రువపత్రం అందించారు. సీఎం జగన్ పాలన అందరికీ నచ్చుతోంది.

– మోరు రమ్య, గుడివాకలంక

రీ సర్వేతో రైతులకు మేలు



కోటేశ్వరదుర్గాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేతో రైతులకు ఎనలేని మేలు చేకూరుతుందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. శుక్రవారం ఏలూరు మండలం కోటేశ్వరదుర్గాపురంలో సర్పంచ్ వరి లక్ష్మీదుర్గ అధ్యక్షతన వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో చేపట్టిన భూముల సమగ్ర సర్వే పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఇందుకోసం ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి ప్రజలు, రైతులకు వివరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వర్రీ నారాయణ, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల తవ్వకాలను ఆపండి

ఏలూరు (టూటౌన్): కైకలూరు నియోజకవర్గంలో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు తక్షణం ఆపాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజారోగ్యం, పర్యావరణం ప్రధాన లక్ష్యంగా చెరువుల తవ్వకాలకు, ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ ప్రజల ఆవాసాలు, మంచినీటి చెరువులు, పొలాలకు దూరంగా నిర్మించుకునేలా అనుమతులు ఇవ్వాలని అన్నారు. నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్ కె.శ్రీనివాస్, ఎం.మహంకాళి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గ్యాంగ్ వర్క్ చేయిస్తున్న రియాజ్

ఏలూరు టౌన్: పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు 46వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి, ముస్లిం మైనార్టీ నాయకుడు రియాజ్ ఆలీఖాన్ అన్నారు. కార్పొరేటర్ ఆయేషా సుల్తానా రియాజ్ ఆధ్వర్యంలో 46వ డివిజన్‌లో శానిటేషన్ గ్యాంగ్ వర్క్ చేయించారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగింపు, డ్రెయిన్లలో పూడిక తీత, చెత్త కుండీల శుభ్రత, వ్యర్థాల డంపింగ్ వంటి పనులు 40 మంది శానిటేషన్ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త, వ్యర్థాలను కార్పొరేషన్ చెత్త వాహనాలకు అందజేయాలని కోరారు.

మెడికల్ రిప్స్ ధర్నా



ధర్నా చేస్తున్న మెడికల్ రిప్స్

ఏలూరు (టూటౌన్): మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి వీవీఎస్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఏలూరు జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట శుక్రవారం యూనియన్ జిల్లా కార్యదర్శి యు.సీతయ్య అధ్యక్షతన ధర్నా చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ 1976 సేల్స్ ప్రమోషన్ చట్టాన్ని ఫార్మా కంపెనీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిప్రజెంటేటివ్స్‌కి మెడికల్ సెలవు, ఇన్సూరెన్స్ స్కీము, మహిళా రిప్రజెంటేటివ్‌లకు వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు మంజూరు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకుడు పి.కిషోర్ మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దు చేసి గతంలో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.ఉమామహేష్, ఎ.సోమేశ్వరరావు, కె.శివ గణేష్, రేవంత్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



చినమాలపల్లిలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రత్యేక శ్రద్ధతో ఇప్పటికే పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు అనుమతులిచ్చారు. రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఎమ్మెల్యే నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతర గ్రాంట్స్‌తో చేయిస్తున్నారు. ఏలూరు 49వ డివిజన్‌లో సుమారుగా రూ.25లక్షల నిధులతో పనులు చేపడుతున్నారు. శుక్రవారం చినమాలపల్లిలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ పరిశీలించారు. కబాడీగూడెంలోని అంబేడ్కర్ నగర్‌లో రెండు చోట్ల సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. పెద్దమాలపల్లిలో సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

దెందులూరు: సమస్యలను పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి, దెందులూరు మండల ప్రత్యేకాధికారి కృపావరం అన్నారు. శుక్రవారం గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లీశ్వరీ కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ కోటే నాగమల్లీశ్వరీ కుమార్ హాజరై మాట్లాడారు. ఎంపీడీవో ఏవీపీవీ లక్ష్మీ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరెంకి సత్యనారాయణ, ఎంపీటీసీలు సువ్వా ప్రభుదాసు, ఏనుగు అంజలి ప్రసాద్, ఉప సర్పంచ్ తోట పద్మారావు, అన్ని శాఖల మండల అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు ప్రయత్నం

పెదపాడు: ఎన్నికలు సమీపించడంతో ప్రజలను మోసగించేందుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆరోపించారు. పెదపాడు మండలం వట్లూరు గ్రామ శివారు సీతారామపురం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ కుల, మత తారతమ్యాల్లేకుండా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని వివరించారు. ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పనిచేయడం గర్వకారణంగా ఉందని చెప్పారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడుతూ పార్టీకి అండగా నిలిచిన సీతారామపురం ప్రజలను తాను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి ఏ పూర్ణ చంద్రరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, మండల గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేపి గోపీ, వట్లూరు సర్పంచ్ జి.రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశాం'



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

దెందులూరు: అన్ని రంగాల్లోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శుక్రవారం పెదవేగి మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కవ్వగుంటలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శంకుస్థాపన చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, అంకన్నగూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్మమ్మ, ఎంపీటీసీ పిల్లి రామకృష్ణ, కవ్వగుంట సర్పంచ్ మద్దాల వాణి, మాజీ సర్పంచ్‌లు పామర్తి వీరయ్య, మద్దాల నాగయ్య, పార్టీ నాయకులు నిమ్మల సుబ్బారావు, నిమ్మల సత్తిబాబు, పసుపులేటి రాజేష్, అరేపల్లి రత్నాకరరావు, గొడుగు కిరణ్, మద్దాల పండు, ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు

రూ.65 లక్షలతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారి సుబ్బారావు, సర్పంచ్ కోటే నాగ మల్లీశ్వరీ కుమార్

దెందులూరు: ప్రతి నియోజకవర్గానికి ఒక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మిస్తున్న నేపథ్యంలో దెందులూరు నియోజకవర్గంలో గోపన్నపాలెంలో ల్యాబ్‌ను నిర్మించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, గోపన్నపాలెం సర్పంచ్ నాగ మల్లీశ్వరీ కుమార్, ఏఈవో గద్దే రమేష్, అధికారులు ల్యాబ్‌ను పరిశీలించారు. ఏడీ సుబ్బారావు మాట్లాడుతూ రూ.65 లక్షలతో ల్యాబ్ నిర్మాణం పూర్తయిందని శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరెంకి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	96	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07-10
బెండకాయలు	34	కంద	40
పచ్చిమిర్చి	96	బీట్‌రూట్	40
కాకర కాయలు	50	కీరా దోస	64
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	250
క్యాబేజీ	26	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	21
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	29

వెలమ సామాజిక వర్గానికి సమున్నత స్థానం



పద్మశ్రీ, ప్రసాదరావులను సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నిడమర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెలమ సామాజిక వర్గానికి ఎన్నడూ లేని విధంగా సముచిత స్థానంతో రాజ్యాధికారం కల్పిస్తున్నారని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం పత్తేపురంలో కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావుకు ఆత్మీయ సన్మానం ఘనంగా నిర్వహించారు. ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి జగన్ ప్రభుత్వం వచ్చే వరకూ జిల్లాలో, రాష్ట్రంలో వెలమలకు రాజ్యాధికార పదవుల్లో సముచిత స్థానం ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. తొలిసారి జగనన్న ప్రభుత్వంలో వెలమలకు అన్ని పదవుల్లోనూ సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని వెలమ సోదరులందరూ ఐక్యంగా ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరినీ సీఎం వైఎస్ జగన్ తప్పనిసరిగా గుర్తిస్తారన్నారు. జెడ్పీటీసీ కోడే కాశి, వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మరడా రంగారావు, వెలమ సంఘం తరుపున చొక్కాకుల లక్ష్మీనరసింహ వరప్రసాద్, రాంప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.